నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | మార్చి 10, 2024 | www.navatelangana.com

బైక్‌పై గుర్తు తెలియని దుండగుల దాడి

సిరికొండ : గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన దోండే కాశీనాథ్ అనే వ్యక్తికి చెందిన బైక్ గురువారం ఎప్పటి లాగే బయట పార్కింగ్ చేసి ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ఇంటికి వచ్చి, వారు నివాసం ఉండే ఇంటి వద్దకి వచ్చి బయట నుంచి డోర్‌ను కొడుతూ నిన్ను చంపి వేస్తాం, బయటికి రాఅని పిలిచి, డోర్‌ను బండలతో, కర్రలతో దాడి చేశారు. అతను బయటికి రాకపోయే సరికి బండిపై రాళ్లతో దాడి చేసి ధ్వంసం చేశారు. ఇంతకు ముందు కూడా ఇలాగే ఒకసారి బెదిరింపులకు గురి చేశారని తెలిపారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.



'రణ స్వరం' ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కవి బొల్లారం బాబన్న రాసిన రెండో కవితా సంపుటి "రణ స్వరం"ను ప్రసిద్ధ కవి కె.శివారెడ్డి శనివారం హైదరాబాద్‌లోని తాజ్ మహల్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిలో కలిగే భావాలను ఎదుటి వాళ్లకు చేప్పటమే కవిత్వమన్నారు. మరెన్నో కవితా సంపుటాలను తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరి శ్రీరాములు రూప్ కుమార్ డబ్బీకర్, వాసిరెడ్డి నవీన్, యువ కవి ఉదారి నారాయణ, ఎంపెల్లి లక్ష్మీనారాయణ. యు గంగన్న, త్రివేణి, ఇందిర పాల్గొన్నారు.



గూడు దక్కేదెవరికో..?

- రేపు ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం
- ఉమ్మడి జిల్లాలో 7.57లక్షల మంది దరఖాస్తు
- తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో 35వేల మందికి లబ్ధి
- సొంతింటి కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

ఏండ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల ఆశలు ఫలించే సమయం వచ్చింది. పేదోడికి గూడు కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 11వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు పూర్తిచేసింది. ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన సభల్లో ఉమ్మడి జిల్లాలో 7.57లక్షల మంది ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తులు అందించారు. కానీ ప్రభుత్వం తొలి విడతలో నియోజకవర్గానికి 3500చొప్పున మంజూరుచేస్తామని ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో 35వేల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది. ఇందుకు లబ్ధిదారుల ఎంపిక అధికారులకు సవాల్‌గా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క ఇప్పటికే వీటిని దక్కించుకునేందుకు పైరవీలు ప్రారంభమయ్యాయి. అధికార పార్టీ నాయకుల ద్వారా ఇంటిని మంజూరు చేయించుకునేందుకు వారి చుట్టూ ప్రదక్షిణలు చేయడం చర్చనీయాంశంగా మారింది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సొంతింటి కల కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వేలాది మంది నిరుపేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించిన ఇండ్లే ఇప్పటికీ పేదలకు దిక్కయ్యాయి. గత పదేండ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంలను కట్టిస్తామని హామీనిచ్చినప్పటికీ అమలు చేయలేకపోయింది. అక్కడక్కడ ఒకటి రెండుచోట్ల నిర్మించి లబ్ధిదారులకు అందజేసింది. కానీ మెజార్టీ జనాలకు దక్కలేదు. దీంతో ఏండ్ల తరబడి ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న అనేక మంది నిరుపేద జంటలకు అప్పటి ప్రభుత్వ నిర్లక్ష్యం తీవ్ర నిరాశకు గురిచేసింది. ఆదిలాబాద్‌లో అసెంబ్లీ ఎన్నికల కంటే ముందుగానే అధికారులు లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్‌రూంలు కేటాయించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ ఇండ్లను మాత్రం ఇప్పటి వరకు కేటాయించలేదు. తాజాగా కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో ఇండ్ల మంజూరుపై జనాల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. అధికారంలోకి వస్తే రూ.5లక్షలతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని ఆరు గ్యారెంటీల్లో పొందుపర్చిన ప్రభుత్వం ఈ హామీని అమలు చేసే దిశగా నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ ఇన్సురెన్సు రూ.10లక్షలకు పెంపుతో పాటు 200యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేస్తోంది. తాజాగా నిరుపేదలకు అత్యంత కీలకమైన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సైతం ప్రారంభించనుండటంతో వేలాది మంది నిరుపేద లబ్ధిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

35వేల మందికి ప్రయోజనం..!

ప్రభుత్వం తొలి విడతలో నియోజకవర్గానికి 3500చొప్పున మంజూరుచేస్తామని ఇది వరకే ప్రకటించింది. ఇందుకు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించనుంది. ఈ పథకం కోసం ప్రజాపాలన సభల్లో 7.57లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా ఆదిలాబాద్ జిల్లాలో 1,99,803మంది, నిర్మల్‌లో 1,93,647మంది, ఆసిఫాబాద్‌లో 1,54,141మంది, మంచిర్యాలలో 2,10,216 మంది ఇండ్లు మంజూరుచేయాలని దరఖాస్తులు అందించారు. కానీ తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో 35వేల మంది లబ్ధిదారులను మాత్రమే ప్రభుత్వం ఎంపిక చేస్తుంది. ఇందులోనూ అర్హులైన వారిని ఎంపిక చేసే ప్రక్రియపైనా స్పష్టత రానుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలు కూడా ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉంది. మరోపక్క ఈ ఇండ్లను దక్కించుకునేందుకు అనేక మంది ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు. వారికి తెలిసిన అధికార పార్టీ నాయకుల ద్వారా తమకు ఇండ్లు కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏండ్ల కోసం వీటి కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఎంపిక ప్రక్రియపై ఆందోళన వ్యక్తమవుతోంది. తొలి విడతలో ఉండేందుకు ఇండ్లు లేని అర్హులైన నిరుపేదలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

విధివిధానాలు రాగానే ఎంపిక : బసవేస్వర్, హౌసింగ్ పీడీ, ఆదిలాబాద్



ప్రభుత్వం ఈ నెల 11వ తేదీన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించనుంది. ఆ తర్వాత ఇండ్ల కేటాయింపునకు సంబంధించి విధివిధానాలు వెల్లడి కావాల్సి ఉంది. వాటి ప్రకారం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు ప్రారంభిస్తాం.

కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా మంచికట్ల ఆశమ్మ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా మాజీ ఎంపీపీ మంచికట్ల ఆశమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా మహిళా విభాగం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర నాయకత్వం సూచించిన పేరును ఆల్ ఇండియా మహిళా అధ్యక్షురాలు అల్కాలాంబ ఆమోదించినట్టుగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత మొగిలీరావు శనివారం ఒక ప్రకటలో తెలిపారు. తనకు అధ్యక్షపదవి రావడంలో సహకరించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్‌లకు తన మీద నమ్మకంతో పదవి కట్టబెట్టినందుకు జాతీయ, రాష్ట్ర మహిళా నాయకత్వానికి మంచికట్ల ఆశమ్మ ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, జిల్లాలో మహిళా విభాగం బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆమె తెలిపారు.

ఐటీ కారిడార్ అభివృద్ధికి సహకారం : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లో ఐటీ కారిడార్ అభివృద్ధి చెందాలని, దానికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని, ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం బీడీఎన్టీ, ఎన్టీటీ డాటా, యూపీడీహెచ్ఐ ఐటీ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పట్టణంలోని ఓ హల్‌లో నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పాయల శంకర్, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ ముఖ్య అథితులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదిలాబాద్ లాంటి మారుమూల ప్రాంతంలో ఐటీ సెక్టర్, ఐటీ కారిడార్ అభివృద్ధి చెందాల్సిన అవసరముందన్నారు. ఇక్కడ కావాల్సిన వనరులున్నాయని, ఐటీ స్కిల్స్ నేర్పుతూ యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్న సంస్థలకు ధన్యవాదలు తెలిపారు. భవిష్యత్తులో తన వంతు సహకారం ఈ సంస్థలకు ఉంటుందన్నారు.

బైక్‌లను కాల్చేసిన దుండగుడి అరెస్ట్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలో వరుసగా బైక్‌లను కాల్చివేస్తున్న నింధితుడిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాచాపూర్ గ్రామంలో తన అన్నకు గ్రామస్తులకు మధ్య జరిగిన పాత గొడవలు మనసులో పెట్టుకొని గ్రామంలో నలుగురు వ్యక్తులకు సంబంధించిన నాలుగు బైకులను రాచాపూర్ గ్రామానికి చెందిన భూషి సాయికుమార్ తగుల బెట్టాడు. గత నెల రోజుల వ్యవదిలో తన అన్నతో గొడవ పెట్టుకున్న వ్యక్తుల కదలికలు గమనిస్తూ, అట్టి వ్యక్తుల బైకులను ఎవరూ చూడని సమయంలో తగలపెడితేనే తన కక్ష్య తీరుతుందని భావించాడు. గత నెల రోజుల కింద అర్ధరాత్రి గ్రామంలో అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన దాసరి అశోక్ సీబీ షైన్ బైకును తన వెంట తీసుకెళ్లిన పెట్రోల్ పోసి నిప్పంటించి, తర్వాత వారం, వారం వ్యవదిలో తన అన్నతో గొడవ పెట్టుకున్న అదే గ్రామానికి చెందిన నవీన్‌గౌడ్, రాందేని మహేష్‌ల పల్సర్ బైకులకు నిప్పంటించాడు. అదే క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అందాజా రెండున్నర గంటలకు అదే గ్రామానికి చెందిన ఈర్ల ముత్యం ఢిలక్స్ బైక్‌కు దుండగుడు నిప్పంటించి పారిపోగా, బాధితుడి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్న సీసీటీవీ కెమెరాలో, అదే గ్రామంలో ఇంకో వ్యక్తి ఇంటి వద్ద కెమెరాలో రికార్డు అవ్వగా నిందితుడిని పోలీసులు గుర్తించి, శనివారం విచారణ చేపట్టారు. వెంటనే సోన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నవీన్ కుమార్, లక్ష్మణచాంద ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడిని పట్టుకొని విచారించగా, నిందితుడి చేసిన నేరాలు బయటపడ్డాయి. నిందితుడి దగ్గర నుంచి పెట్రోల్ తీసుకెళ్లడానికి ఉపయోగించిన బాటిల్, నింధితుడు నేరం చేసిన సమయంలో ధరించిన దుస్తువులు, అగ్గిపెట్టె స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచగా, నిందితుడికి 10 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. త్వరితగతినకేసు దర్యాప్తు చేసి నింధితులను పట్టుకున్న సీఐ నవీన్ కుమార్, లక్ష్మణచాంద ఎస్సై, కానిస్టేబుల్ కిరణ్, భీమేష్, సాయి, సునీల్‌లను నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

పిల్లలకు నిరవధికంగా టీకాలు వేయించాలి

ఇంద్రవెల్లి : ప్రసూతి అయిన తరువాత నవజాత శిశువులకు నిరవధికంగా టీకాలు అందించాలని పిట్టబొంగరం వైద్యులు డా.ప్రతాప్ నాయక్ అన్నారు. శనివారం ఆయన కొండాపూర్ సబ్ సెంటర్ పరిధిలోని మారుమూల గ్రామమైన తిమ్మాపూర్ గ్రామంలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రసూతి అయిన తల్లుల, మాత శిశురక్షణ, టీకాలు వేసిన కార్డును తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది తమ తమ సెంటర్ పరిధి లోని గ్రామాలను సందర్శించి, టీకాలను వేయించాలని సూచించారు. వంద శాతం టీకాలను పూర్తి చేయాలని పేర్కొన్నారు.

దైవ భక్తితోనే మానసిక ప్రశాంతత

నవతెలంగాణ-నార్నూర్

దైవ భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, సేవాలాల్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని చోర్‌గావ్ గ్రామంలోని శ్రీమూర్తి రాములు శివాలయంలో శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని అన్నారు. భక్తి శ్రద్ధలతో గ్రామాల్లో ఐక్యత నెలకొంటుందని అన్నారు. ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శివాలయ పీఠాధిపతి శ్రీరామ్ మహారాజ్, రాంసింగ్ మహారాజ్, బరప్ సింగ్, నట్చోడ్, అర్జున్, గజానంద్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితులు అరెస్ట్
- కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అక్రమంగా 3.4కిలోల గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. శనివారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలను పూర్తిగా రూపుమాపాలనే జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు జిల్లా నలుమూలలతో పాటు జిల్లా కేంద్రంలోను విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే గంజాయిని పట్టుకోవడం జరిగిందన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక రామ్‌నగర్ అగ్రికల్చర్ కళాశాల పరిసర ప్రాంతం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొందరు అనుమానంగా తిరగడాన్ని గమనించారన్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా నిందితులను పట్టుకొని విచారించగా విషయం బయటపడిందని తెలిపారు. పట్టుబడ్డ వారిలో ఇచ్చోడలోని మహాత్మ జ్యోతిబాపూలే స్కూల్లో స్కావెంజర్‌లుగా పనిచేస్తున్న ఏ1 బనియ శాంతాబాయిగా గుర్తించామని, ఈమె బోథ్ మండలంలోని సోనాల సమీపంలో గల గుర్రాల తండా గ్రామానికి చెందినది, కాగా ప్రస్తుతం ఆదిలాబాద్‌లోని రామ్‌నగర్‌లో నివాసం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఏ2 సంజయ్ కూడా ఇదే మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో స్కావెంజర్‌గా పని చేస్తుండగా ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఈ ఇద్దరు నేరస్తులు డబ్బు మీద అత్యాశ, పరిస్థితుల ప్రభావం వల్ల తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్మి డబ్బులు సంపాదించాలని ఈ వ్యవహారాన్ని నడుపుతున్నట్లు తెలిపారు. నిందితుల కథనం ప్రకారం శాంతాబాయి తన తమ్ముడు నార్నూర్ మండలం చోర్‌గావ్ గ్రామానికి చెందిన కేవల్ సింగ్ వద్ద గంజాయిని పండించి, మహారాష్ట్రకు తరలించే క్రమంలో మావల పోలీస్ స్టేషన్ సిబ్బంది తనిఖీ చేయగా పట్టుబడ్డారని పేర్కొన్నారు. నిందితుల వద్ద నుండి 3.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. వీరి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. గంజాయిని అంతర్ పంటగా పండించిన తమ్ముడు కేవల్‌సింగ్ ఇదివరకే ఫిబ్రవరి 10వ తేదిన నార్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ప్రస్తుతం జైలులో ఉన్నారని అన్నారు. గంజాయి అక్రమంగా పండించిన, గంజాయి, మాదకద్రవ్యాలను రవాణా లాంటి చట్ట విరుద్ధమైన కార్యక్రమాల్లో పాల్గొనడం నేరమని వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఎటువంటి సమాచారం అయినా జిల్లా ఉన్నతాధికారులకు కానీ, డయల్ 100 ద్వారా కానీ సమాచారాన్ని అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, రూరల్ సీఐ ఫణినిందర్, ఎస్సై విష్ణువర్ధన్, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నవతెలంగాణ-తాంసి



ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తాంసి మండలంలోని వడ్డాడి గ్రామంలోని శ్వయంబు శ్రీలక్ష్మి నరసింహ స్వామీ దేవాలయంలో శివరాత్రి పర్వదినాన్ని పుస్కరించుకుని, గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. శనివారం చివరిరోజు కావడంతో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. గ్రామస్తులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి సారి విచ్చేసిన ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతన చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని సందర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయాభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని అన్నారు. ఎక్స్ రోడ్ నుంచి గ్రామానికి వచ్చే రహదారితో పాటు ప్రాజెక్ట్ దగ్గర బ్రిడ్జ్ నిర్మాణం కోసం నిధులు అతి త్వరలో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన విషయాలను నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, కన్వీనర్లు అరుణ్, నాగయ్య, తాంసి భీంపూర్ మండలాలకు చెందిన నాయకులు లస్మన్న, అఫ్రోజ్, సంజీవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్, సంతోష్, భూమన్న, సదానందం, ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

దొంగతనానికి పాల్పడిన ముగ్గురి రిమాండ్



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని మాధవి వైన్‌షాపులో గత 6న బుధవారం దొంగతనానికి పాల్పడి దొరికిన ముగ్గురు నిందితులను శనివారం ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ ఫణిందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని మాధవి వైన్ షాపులో గత మూడు రోజుల కింద మండల కేంద్రానికి చెందిన నలుగురు వ్యక్తులు గుగ్గిళ్ల పోశెట్టి, గుండాని మహేందర్, షేక్ సోహెల్, శ్రీకాంత్ నలుగురు వ్యక్తులు గత నెల రోజుల నుంచి ఎవరికి అనుమానం రాకుండా వైన్‌షాప్ పైన ఉన్న రేకులు తొలగించి, నిచ్చెన సహాయంతో వైన్ షాప్‌లోని వెళ్లి ఒరిజినల్ ఛాయిస్, చీప్‌లిక్కర్ మద్యం పెట్టెలను రోజుకు రెండు, మూడు చొప్పున 37 మద్యం పెట్టెలను దొంగలించారు. మద్యం విలువ రూ.2 లక్షల 12వేల 640 విలువ ఉన్నట్టు తెలిపారు. ఎవరికి అనుమానం రాకుండా రేకులను యధావిధిగా పెట్టేవారు. వైన్స్ వారికి లెక్కలు తేడా రావడంతో సీసీ కెమెరాలు రికార్డు కావడంతో 6న అర్ధరాత్రి కాపు కాసి నిందితులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ముగ్గురుని అదుపులోకి తీసుకోగా ఒకరు పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ, ఇన్‌చార్జీ ఎస్సై ధనశ్రీ తెలిపారు.

కలెక్టర్‌ని కలిసిన సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కలెక్టర్ రాజర్షిషాను సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలను స్వీకరించిన రాజర్షిషాను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసి మెమోంటోతో పాటు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తాము చేపడుతున్న కార్యక్రమాలను సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి గెడం మాదవ్, ప్రఫుల్ వర్ఘె, రేణికుంట్ల రవీందర్, చౌహన్ శశికళ, ఉరాడే సుభాష్, మహిపాల్ పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్ : ఉచిత కంప్యూటర్ శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ యూనిస్ అక్బానీ సూచించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు శనివారం పట్టణంలో సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యురాలు డాక్టర్ నౌమీ అంజుమ్, సమీయుద్దీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం సుమారు 350 మందికి ఫ్రీ హెల్త్ చెకప్ రసీదులను అందజేశారు. నేటి యుగంలో కంప్యూటర్ శిక్షణ ఎంతో అవసరమని వక్తలు పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | మార్చి 10, 2024 | www.navatelangana.com

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

నవతెలంగాణ-సిరికొండ



108 అంబులెన్సులో మహిళ ప్రసవించింది. మండలంలోని రాజంపేట్ గ్రామానికి చెందిన రమణబాయి అనే నిండు గర్భిణికి శనివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందజేశారు. దీంతో అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకొని అంబులెన్స్ లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. మెరుగైన వైద్యం కోసం ఇచ్చోడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటి సురేష్, పైలెట్ వినోద్‌లు తెలిపారు.

మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని పరామర్శించిన బోధన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిర్మల్



మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సోదరుడు హనుమంత్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా శనివారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నివాసంలో బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి, నాయకులు సునీల్‌రెడ్డిలు మాజీ మంత్రిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, నాయకులు వెంకట్ రాంరెడ్డి, మార్గొండ రాము, దర్మజిగారి రాజేందర్, శ్రీధర్, జీవన్ రెడ్డి, పాకాల రామచందర్ పాల్గొన్నారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రజలు పోలీసులకు సహకరించాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ మొగిలి అన్నారు. శనివారం ఉట్నూర్ పట్టణంలోని సీఐ కార్యాలయంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేసి సీఐ మాట్లాడారు. ద్విచక్రవాహనంపై వెళ్లేవారు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. బైక్‌పై ముగ్గురు కూర్చొని అతివేగంతో నడిపి ప్రమాదానికి గురి కాకూడదని సూచించారు. యువత లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వారిపై చట్టబద్ధంగానే చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో కలిగి ఉండాలని ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా పోలీస్ వాళ్లకి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మనోహర్ పోలీసులు ఉన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేత

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని 82 మందికి కళ్యాణ చెక్కులు రాగ సంబంధిత చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, ఆర్ఐ నారాయణ, ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్, బీజేపీ మండలాధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు సాంప్లీ రమేష్, టి.రమేష్, దశరథ్, సురేందర్‌రెడ్డి, సపటొల్ల పోతున్న, దేవన్న, రవికిరణ్, రాంచందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ సీఐగా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన మొగిలిని క్యాంపు కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల నాయకులు బాబా శ్యామ్‌తో కలిసి బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మొగిలి మాట్లాడుతూ శాంతి భద్రతల దృష్ట్యా ఉట్నూర్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్‌శాఖ తరుపున మంచి సేవలు అందిస్తామని తెలిపారు. ప్రజల తరుపున కూడా పోలీస్ శాఖకు పూర్తి సహాయ సహకారాలు అందిచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజయ్, అజయ్ పాల్గొన్నారు.

పూలాజీ బాబా ధ్యాన మందిర వార్షికోత్సవం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కుచులాపూర్ గ్రామంలో శనివారం పూలాజీ బాబా 28వ ధ్యాన మందిరం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. జెండా ఆవిష్కరణ చేసి, అనంతరం ధ్యానధారణ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూలాజీ బాబా సంస్థాన్ అధ్యక్షులు పెట్కులే రవీందర్ మాట్లాడుతూ అందరూ బాబా అడుగుజాడల్లో నడుచుకుంటూ బాబా మార్గంలో ప్రయాణించాలని, తద్వారా ధ్యానాన్ని అలవర్చుకొని జ్ఞానంతో పాటు మానసిక ప్రశాంతతను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వామన్, జనార్ధన్, రాములు, రమేష్, గజానన్, పుండలిక్, మహిళలు, బాబా భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఉపవాస దీక్షలతో రాత్రంతా జాగరణ కార్యక్రమాలు చేశారు. కొండాపూర్ గ్రామ సమీపంలోని పురాతన శివాలయంలో శ్రీ కృష్ణలీలా నాటిక ప్రదర్శనను నార్నూర్ మండలవాసులు నిర్వహించారు. భక్తులు ఉపవాసాలు విరమించి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రయివేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కుష్బు గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉట్నూర్ పట్టణంలోని కుమురంభీం కాంప్లెక్స్‌లో వైటీసీ కార్యాలయంలో ఎంపిక ఉంటుందని, ప్రతి ఒక్క విద్యార్థులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట బయోడేటా, ధృవీకరణ పత్రాలు తీసుకొని వచ్చి 13న బుధవారం ఉద్యోగ మేళాకు హాజరుకావాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుత్ పనుల మరమ్మతు కారణంగా ఈనెల 10న పట్టణంలోని వివిధ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కైలాస్‌నగర్, మావల 33 కేవీ ఫీడర్‌లలో మరమ్మత్తు కోసం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఖానపూర్, వినాయక్ చౌక్, శాంతినగర్, కైలాస్‌నగర్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు, మసూద్‌చౌక్, టీచర్స్ కాలనీ, సప్తగిరి కాలనీ, అటెండరు కాలనీ, ఆర్ఆర్ నగర్, దస్నాపూర్, రామ్ నగర్, సంజయ్‌నగర్, కలెక్టర్ చౌక్, రిమ్స్, పాలిటెక్నిక్ ఇండస్ట్రియల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

'మోడీ పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమీ లేదు'

- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 4న నిర్వహించిన మోడీ సభతో జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్ ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం జిల్లా ప్రజలను మరొక సారి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మోసం చేశారని అన్నారు. జిల్లా ప్రజలు ఎన్నో ఏండ్లుగా జిల్లా అభివృద్ధికి కావాల్సిన ఎజెండాలను కేంద్రం దృష్టికి తెచ్చిన వాటిని ఏ మాత్రం పట్టించుకోకపోవడం జిల్లా ప్రజల పట్ల వారికి ఉన్న నిర్లక్ష్యం తెలియజేస్తుందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సీసీఐ తెరిపిస్తామని, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్, గిరిజన యూనివర్సిటీ, జిల్లా కేంద్రంలో విమానాశ్రయం, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయిస్తామని హామీలిచ్చి ఎంపీగా గెలిపించిన ప్రజలను మరిచారని అన్నారు. మళ్లీ ఎమ్మెల్యేలుగా బీజేపీ పార్టీ వారిని నలుగురిని గెలిపించిన ఏ మాత్రం జిల్లా అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు చేయలేదన్నారు. మోడీ పర్యటన సందర్భంగా జిల్లా ప్రజలు కోటి ఆశలతో పై సమస్యలు మోడీ పరిష్కరిస్తారని ఆశించిన, ప్రజలకు మొండి చేయి చూపెట్టారని దుయ్యబట్టారు. మోడీ పర్యటన జిల్లా అభివృద్ధికి ఏ మాత్రం తోడ్పాటు కాకా ఎన్నికల కోసం వచ్చి మళ్లీ ప్రజలను మోసగించేట్టు ఉందని అన్నారు. జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించని బీజేపీ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, కిరణ్, సచిన్ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల పాల్గొన్నారు.

కాంగ్రెస్ వ్యతిరేక శక్తులను పార్టీలోకి అనుమతించం

- ఎఐసీసీ తెలంగాణ రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్



కాంగ్రెస్‌లో చేరిన పలువురుతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, తుల అరుణ్ కుమార్

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

కాంగ్రెస్ వ్యతిరేక శక్తులను కాంగ్రెస్‌లోకి అనుమతించేది లేదని ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్ అన్నారు. మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో బీఆర్ఎస్ నాయకులు పలువురు ముఖ్య నాయకులు శనివారం పార్టీలో చేరినట్టు ఆయన పేర్కొన్నారు. నానక్ సింగ్, కొడారి నరేష్ దేగామ, ప్రహ్లాద్ భుతాయి, కేదార్ సంజీవ్, బి.రాజు, ఎం.కపూర్‌చంద్, సిడాం హరిచంద్, టి. జగదీష్, ఆర్.జగదీష్, ముర్కుటే మారుతి, మిత్కరే బాలాజీ, కొడప ఆనందరావు, సిడం నాగరావు, అత్రం లచ్చు, హాయ్యు, హన్మంత్‌రావు, కోక్కుల రాజ, చట్ల జగదీష్‌లను, ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్, జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య కండువాలను కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తుల అరుణ్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామస్థాయిలో నుంచి కార్యకర్తలను చేర్చుకోవడం జరుగుతుందని అన్నారు. గ్రామస్థాయి నుంచి నాయకులు చురుకుగా పని చేయాలని తెలియజేశారు. జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని సుమారు 30 సంవత్సరాల నుంచి మా బుజాలపై మోశామని అన్నారు. అధికారంలో లేకున్నా రెండు సార్లు జెడ్పీటీసీగా గెలిచి మండలంలో కాంగ్రెస్‌ని ముందుండి నడిపించామని అన్నారు. 10 సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొందరు మమ్మల్ని ఇబ్బంది పెట్టినా, కాంగ్రెస్ పార్టీ పట్టువిడలేదని అన్నారు. మమ్మల్ని ఇబ్బంది పెట్టిన బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేఖంగా పని చేసిన వారు ఈ రోజు కాంగ్రెస్‌లోకి మాకు తెలియకుండా కేవలం వారి అవసరాల కోసం కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరుగుతుందని అన్నారు. అటువంటి నాయకులను కాంగ్రెస్‌లోకి అనుమతించేది లేదని అన్నారు. ఒకవేల కాంగ్రెస్‌లోకి రావాలంటే ముందు మాఅనుమతి నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అనుమతితోనే కాంగ్రెస్ పార్టీలోకి రావాలన్నారు. ఎవరి సమక్షంలో అయిన పార్టీలో చేరితే దీనిని తీవ్రంగా ఖండిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జల్కే పాండురంగ్, బజార్‌హత్నూర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమ్మెలోకి దిగిన రిమ్స్ కార్మికులు

- వేతనాలు చెల్లించాలని డిమాండ్



సమ్మెలో కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పని చేసే కార్మికులకు కాంట్రాక్టర్ జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం రిమ్స్ ఎదుట సమ్మె చేపట్టారు. కాంట్రాక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ మాట్లాడుతూ రిమ్స్ కాంట్రాక్ట్ ప్రతిపాదిక పని చేస్తున్న సానిటేషన్, సెక్యూరిటీ గార్డ్, పేషంట్ కేర్ సిబ్బందికి జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. వేతనాల కోసం 14 రోజులుగా నిరసనలు తెలిపిన పట్టించుకోవడం లేదన్నారు. దాని కారణంగా విధులు బహిష్కరించి సమ్మె చేపట్టామన్నారు. గత కొన్ని రోజులుగా రిమ్స్ ఎదుట నిరసన తెలిపిన పట్టించుకోకపోవడంతో సమ్మెలోకి దిగినట్టు తెలిపారు. జీఓ ప్రకారం రూ.15 వేల 600 ఇవ్వాల్సి ఉండగా, కేవలం 11 వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులను దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్, రాజు, ఎక్బాల్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులతో పాటు వైద్య సిబ్బంది విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని పిట్టబొంగరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి చెందిన పలు రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు సరిగా విధులకు రావడం లేదని పిట్టబొంగరం గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లి శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పీహెచ్‌సీ వైద్యుడు ప్రజలకు అందుబాటులోకి ఉండకపోవడంతో ఆదివాసీ గిరిజనులు వైద్యపరంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులతో పాటు వైద్య సిబ్బంది విధులు సరిగా నిర్వహించి, ఏజెన్సీ ప్రజలకు వైద్య పరంగా పూర్తి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు ముఖాడే ఉత్తమ్, పట్టణ అధ్యక్షులు ఎండీ జహిర్, జిల్లా నాయకులు జితేందర్, మాజీ మండలాధ్యక్షులు సోమోరే నాగోరావ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసూద్, నాయకులు పాల్గొన్నారు.

రేపు రంజాన్ పండుగపై సమీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న రంజాన్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 11న సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ రాజర్షిషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో రంజాన్ ఏర్పాట్లపై చర్చించడం జరుగుతుందని, జిల్లా అధికారులు, ముస్లిం మత పెద్దలు ఈ సమీక్ష సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పలు బాధిత కుటుంబాలను శనివారం డీసీసీ అధ్యక్షులు కుచాడి శ్రీహరిరావు పరామర్శించారు. మునిపల్లి గ్రామానికి చెందిన నూతికాడి రాజారెడ్డి, గుర్రాల లింగారెడ్డి అమ్మమ్మ మరణించినందున వారి కుటుంబాన్ని పరామర్శించారు. మండల కేంద్రంలో గతవారం రోజుల కింద మలేషియాలో మరణించిన మంగళి భీమేష్ కుటుంబాన్ని పరామర్శించి, రూ.10పది వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మగ్గం లింగన్న గత వారం కిందట అనారోగ్య కారణంగా మరణించగా వారి కుమారుడు మొగ్గం మోహన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వోడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, నారాయణ, మాజీ సర్పంచ్ ప్రభాకర్, రమేష్, శేఖర్‌రెడ్డి, అట్లా రాంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బిర్కుల నర్సయ్య, సిర్ర లింగన్న ఈటల లచ్చన్న, భూమన్న కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-సిరికొండ

గ్రామాలాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని ముత్యంపేట్ గ్రామంలో కొలాం కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అనంతరం కొండాపూర్ గ్రామ సమీపంలోని పురాతన శివాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, నాయకులతో కలిసి భోజనం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్ రావ్, కాంగ్రెస్ నాయకులు పాండు, రఘురాం, ఇమామ్, ప్రవీణ్, భీంరావ్, గుణవంత్‌రావ్ పాల్గొన్నారు.

రవన్న స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తాం



నవతెలంగాణ-నిర్మల్

సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి, భారత విప్లవోద్యమ నాయకులు రవన్న పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు కే.రాజన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో రవన్న 8వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సమ సమాజమే లక్ష్యంగా 48 సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపిన భారత విప్లవోద్యమ నాయకుడు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శిగా రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) పని చేశారని అన్నారు. భారత విప్లవోద్యమానికి, ప్రజా ఉద్యమాలకు, ప్రజాపంథాకి తీరని నష్టం అయినప్పటికీ వారి పోరాట స్ఫూర్తితో మాస్‌లైన్ పార్టీతో ప్రజా సమస్యలపై మరిన్ని పోరాటాలు నిర్మిస్తామని అన్నారు. కార్యకమంలో మాస్‌లైన్ జిల్లా నాయకులు కే.లక్ష్మి, గంగామణి, కవిత, చిట్టి, వసంత, గంగాధర్ పాల్గొన్నారు.

డాక్టర్ వేణుగోపాలకృష్ణకి ఘన సన్మానం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంఓగా ఉత్తమ సేవలందించిన డాక్టర్ వేణుగోపాలకృష్ణని మహాశివరాత్రి సందర్భంగా శనివారం మండలంలోని బాబాపూర్ శివాలయంలో ఘనంగా సన్మానించారు. డాక్టర్ వేణుగోపాలకృష్ణ ఇప్పటికి పలు జాతీయ, రాష్ట్రస్థాయి, జిల్లా ఉత్తమ వైద్యాధికారి అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. పేద ప్రజలకు, రోగులకు, పోలీస్ శాఖకు అత్యున్నత సేవలందించారు. డాక్టర్ వేణుగోపాలకృష్ణ నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎండీ బయో కెమిస్ట్రీ చేస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు హర్ష, రవి తేజతో పాటు లక్ష్మణచాంద ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో, ఏఎస్సై గంగాధర్, నారాయణరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, పోలీస్ కానిస్టేబుల్ సంజీవ్, సునీల్, కిరణ్, గణేష్, సువాస్, భూమన్న పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | మార్చి 10, 2024 | www.navatelangana.com

బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బాధితుడు కుటుంబానికి స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీష్ బాబు తెలిపిన వివరాలు ప్రకారం 2023 డిసెంబర్ 9న వాంకిడి మండలంలోని కిరిడీ గ్రామానికి చెందిన యువకుడు గోపాల్ కుటుంబ సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన కుటుంబ పరిస్థితులు తెలుసుకొని హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతున్న వివేకానంద సేవ సమితి వారికి విషయాన్ని వివరించగా వారు బాధితుల కుటుంబానికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సమితి అధ్యక్షుడైన హనుమంతరావు చేతుల మీదుగా బాధితులు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థిక సహాయం రావడానికి ప్రోత్సాహం అందించిన ఆదిలాబాద్ నివాసి నారాయణరెడ్డి కి, సతీష్ బాబుకు కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. బాధితులకి అండగా ఉండడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని వారు తెలిపారు.

పోటెత్తిన భక్తులు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని పెంచికల్‌పేట్ గ్రామ శివారులో గల వీరభద్రస్వామి దేవాలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో శనివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. జాతరలో బారెగూడ మాజీ సర్పంచ్ రేణికుంట్ల సంతోష్-ధనలక్ష్మి దంపతులచే భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏఎస్ఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఘనంగా శివరాత్రి వేడుకలు



నవతెలంగాణ-కౌటాల

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి నుండి శనివారం వరకు మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన సదాశివపేట్ శివాలయంలో శుక్రవారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు అంబేద శంకరయ్య, సంతోష్ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య కళ్యాణం రమణీయంగా జరిగింది. స్వయంభువుగా వెలిసిన కంకాలమ్మ గుట్టపై ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో హోమం, శివపార్వతుల కల్యాణం, రామాలయంలో హోమం, శివపార్వతుల కల్యాణం, తాటిపెల్లి కుర్ర వద్ద గల వార్ధా నదిలో రెండో రోజు భక్తులు అధిక సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించి హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మెన్ ఎలుములే దత్తు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. తాటిపెల్లి వద్ద వార్ధా నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు ఎడ్ల బండ్లపై అధిక సంఖ్యలో తరలివెళ్లారు. జాతర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌటాల ఎస్ఐ మధుకర్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో గౌరవాధ్యక్షుడిగా శ్రీధర్, అధ్యక్షుడిగా అశోక్ చందర్, సహాధ్యక్షులుగా తిరుమలగౌడ్, సుజాత, ప్రధాన కార్యదర్శిగా గణేష్, సంయుక్త కార్యదర్శిగా శాంతిస్వరూప్, అర్పియా సుల్తానా, కోశాధికారిగా లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయడానికి ముందే జీవో 317 ద్వారా నియమితులై మన జిల్లాలో ఉన్న వేరే జిల్లాల వారిని స్థానికత ఆధారంగా వారి సొంత జిల్లాలకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిసెలవుల్లో ఆగిపోయిన పదోన్నతులు, బదిలీలను వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులుగా భానుప్రకాష్ పాల్గొన్నారు.

నేడే సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో వచ్చే విద్యా సంవత్సరానికి గాను నిర్వహించే సైనిక్ స్కూల్ సెట్-2024 నేడు జిల్లా కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల చీఫ్ సూపరెంట్ శ్రీనాథ్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైనిక్ స్కూల్ సెట్ కోసం జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఓకే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకొని వారు వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ముందస్తుగా కేంద్రానికి చేరుకోవాలని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని గుండాయిపేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని గుడ్లబోరి ఫీడర్ సంబంధించిన కౌటాల సబ్‌స్టేషన్ పరిధిలోని విజయనగరం ఫీడర్‌కు సంబంధించిన 11 కేవీ లైన్ మరమ్మత్తులు చేయనున్న కారణంగా ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ అధికారి రవీందర్ తెలిపారు. వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

33/11 కేవీ సబ్ స్టేషన్ నెల వారి మరమ్మతుల కారణంగా ఆదివారం జిల్లా కేంద్రంలో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ సదాశివ్ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా రెండు గంటల పాటు నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

శివాలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్ శివాలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శివరాత్రి ఉపవాసాల విరమణ రోజు అన్నదానం చేయడం పరిపాటిగా వస్తుందన్నారు. శివరాత్రి ఉత్సవాల విజయవంతనికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షులు అశోక్, ప్రముఖులు చిలువేరు వెంకటేశ్వర్లు, గంధం శ్రీనివాస్, సతీష్, అక్కు విజయ్, నారాయణ, సతీష్, సాయి, అశోక్, మల్లేష్, దయాసాగర్, శ్రావణ్, ప్రశాంత్, నరసింహ, మధునయ్య పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ రగడ

- మధ్యలోనే వెళ్లిపోయిన ఎమ్మెల్యే
- ప్రోటోకాల్ పాటించని అధికారులపై ఫిర్యాదు చేస్తాం : పాల్వాయి హరీష్‌బాబు



గేటు వద్ద వేచిచూస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కస్తూర్బాగాంధీ విద్యాలయం కళాశాల ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్‌ను సమగ్ర శిక్ష అధికారులు పాటించలేదని అధికారులపై ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ కళాశాల అదనపు తరగతి గదులను ప్రారంభోత్సవానికి ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణను ఆహ్వానించగా కళాశాలకు కోనేరు కృష్ణ ముందుగా చేరుకొని పది నిమిషాలు గేటు వద్దనే వేచిచూశారు. ఈ క్రమంలో సమగ్ర శిక్ష జేఈ శరత్ గేటుకు ఉన్న రిబ్బన్‌ను తొలగించి లోపల కూర్చోమని తెలిపారు. దీనిని గమనించిన ఎమ్మెల్యే ప్రోటోకాల్ పాటించలేదని వెళ్లిపోతుండగా ఎమ్మెల్యేను క్షమించమని అధికారులు కోరినప్పటికీ ఆయన ససేమిరా అని అక్కడి నుండి వెళ్లిపోయారు. దీంతో కోనేరు కృష్ణ సుమారు అరగంట పాటు వేచిచూసి కళాశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ కళాశాల భవనం ప్రారంభోత్సవానికి ఆహ్వానించి సమగ్ర శిక్ష అధికారులు ప్రోటోకాల్ విధానాన్ని పాటించనందున వారిపై చర్యలు తీసుకోవాలని పై అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.



తిరిగి వెళ్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

సామూహిక వివాహాలతో పేదలకు మేలు

- ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, వెడ్మ బొజ్జు
- 12 జంటలకు సామూహిక వివాహాలు
- కమిటీ, ఆలయ సభ్యులకు ప్రత్యేక అభినందనలు



వివాహాలు జరిపిస్తున్న ఎమ్మెల్యేలు కోవ లక్ష్మీ, వెడ్మ బొజ్జు

నవతెలంగాణ-జైనూర్

సామూహిక వివాహాలు చేయడంతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం సిర్పూర్(యు) మండలంలోని మహాగాం గ్రామంలో ప్రతి ఏడాది మహా శివరాత్రి సందర్భంగా ఆదివాసీల దేవత సురోజీ మహారాజ్ మందిరం ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా సామూహిక వివాహాలలో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల నుండి ఆదివాసులలో పేద ప్రజలు ఉన్నవారికి ప్రత్యేకంగా ఈ కార్యక్రమంలో ఆహ్వానించి పెళ్లి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఇలాంటి సామూహిక వివాహ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రతి ఏడాది అమ్మాయి పెళ్లి చేసుకోవాలంటే సామూహిక విభాగం ఎంతో లాభపడుతున్నారని అభినందించారు. సామూహిక వివాహాల ద్వారా ప్రతి ఒక్కరికి సహాయపడుతుందని కొనియాడారు. పేద ప్రజలకు ఇలాంటి సాంఘిక విలువల ద్వారా వారి కుటుంబాలకు న్యాయం చేసే విధంగా ఆలయ కమిటీ పని చేస్తుందని కమిటీని అభినందించారు. ఎన్నో సంవత్సరాల నుండి ఈ సామూహిక వివాహ కార్యక్రమాలు వారికి అభినందించారు. ఈ సామూహిక వివాహాల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మద్దతు ప్రతి ఏడాది ఇస్తారని వారికి కూడా ప్రజల తరపున అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు జర నిర్వహించడంలో తన వంతు అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం 12 జంటలకు వివాహాలు నిర్వహించారు. ఈ సామూహిక వివాహంలో కేవలం రూ.5150 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాజరైన వారికి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుమురం భీం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్ రావు, జడ్పీటీసీ కోవ అరుణ, జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్ రావు, మండల పరిషత్ అధ్యక్షురాలు తొడ సంభాగ్య లక్ష్మి, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాష్, సిర్పూర్(యు) బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ధర్మారావు, జైనూర్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాల, నాయకులు జన్నావార్ పవన్ పాల్గొన్నారు.



సామూహిక వివాహ వేడుకల పూజల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

బ్యాంకు ఖాతాలను ఆధార్ అనుసంధానించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని సీసీఐకు పత్తి విక్రయించిన రైతులు తమ బ్యాంక్, ఇండియా పోస్ట్ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ కార్డును అనుసంధానించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తమ బ్యాంకు ఖాతా ఆధార్‌తో అనుసంధానం కానీ పక్షంలో పత్తి అమ్మిన డబ్బులు జమ కావని, ఇప్పటికే పత్తి అమ్మిన డబ్బులు జమ కానీ రైతులు తక్షణమే ఇండియా పోస్ట్ బ్యాంక్ అయితే తమ పాన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకుని సమీపంలోని పోస్ట్ ఆఫీస్‌లో సంప్రదించి తమ ఖాతాను సేవింగ్ ఖాతాగా మార్చుకొని క్రెడిట్ లిమిట్ పెంచుకొని, సేవింగ్ ఖాతా అనుసంధానం అయినట్టు, క్రెడిట్ లిమిట్ పెరిగినట్లుగా నిర్ధారించుకొని పోస్ట్ మాస్టర్‌తో ధ్రువీకరించి నకలు ప్రతిని సంబంధిత వ్యవసాయ మార్కెట్ కమిటీలో అందజేయాలన్నారు. బ్యాంకు ఖాతా యాక్టివ్‌గా లేకపోతే యాక్టివ్ చేసుకునేందుకు తమ పేరిట గల ఇతర బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకునేందుకు బ్యాంకుకెవెళ్లి ఈ-కేవైసీ చేసుకోవాలని సూచించారు. అనుసంధానం అయినట్లు నిర్ధారణ ప్రతిని సంబంధిత వ్యవసాయ మార్కెట్ కమిటీలో అందజేయాలన్నారు. రైతులు తమ ఖాతా ఆధార్‌తో అనుసంధాన వివరాలు తెలుసుకునేందుకు డీబీటీభారత్.జీఓవీ.ఇన్, మైఆధార్.యూఐడీఏఐ.ఇన్‌లో లేదా కార్యాలయ పని వేళలలో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ సెల్: 7330733437, 8688886142, కాగజ్ నగర్ మార్కెట్ కమిటీ సెల్: 7330733462 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

మానవ సేవే మాధవ సేవ : ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

నవతెలంగాణ-జైనూర్

మానవసేవాయే మాధవ సేవాని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. శనివారం మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పాట్నాపూర్ గ్రామ పరిధిలో ఉన్న పులాజి బాబా సంస్థాన్ ఆలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ ఎంపీ ఆశావాహు అభ్యర్థి ఆత్రం సుగుణ, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖశ్యాం నాయక్‌లతో కలిసి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన ముఖ్య అతిథులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పులాజి బాబా చేసిన సేవలు మరువలేనిదన్నారు. ప్రాంత ప్రజలకు ఎంతో సేవలు అందించాలని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రతి ఒక్క యువత తమ జీవితంలో పులాజి బాబాకు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. చెడ్డ వ్యాసనానికి దూరంగా ఉండేందుకు ఈ ప్రాంత ప్రజలకు పులాజి బావ ఎన్నో మార్గదర్శకాలని తెలిపారు. ఆయన చేసిన సేవలతో ఈ ప్రాంత ప్రజలు ఈ రోజు కూడా చెడ్డ వ్యాసానికి దూరంగా ఉంటున్నారన్నారు. నేటి సమాజంలో ఉన్న ప్రతి యువత వారి సేవలను గుర్తించి ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ఆలయానికి అభివృద్ధి కోసం ఎన్నో నిధులు కేటాయించారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో తన వంతు అన్ని విధాలుగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పులాజీ బాబా చేసిన సేవలకు ఈ ప్రాంత ప్రజలకు ధ్యాన కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. అన్ని ధ్యాన కేంద్రాలలో ప్రజలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని, వచ్చిన భక్తులు అన్ని విధాలుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కమిటీ అలయ చైర్మన్ కేశవరావు, మాజీ సర్పంచ్ కందారే బాలాజీ, జైనూర్ ఎంపీపీ కుమురం తిరుమల విశ్వనాథ్, వైస్ ఎంపీపీ చెల్లె లక్ష్మ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పులాజి బాబా భక్తులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

బీఆర్ఎస్ నాయకులకు ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-జైనూర్

బీఆర్ఎస్ యువ నాయకులు మెస్రం అంబాజీ కొన్ని రోజుల క్రితం ద్విచక్ర వాహనం ఢీ కొండి పడిపోవడంతో ఆయనకు శనివారం ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరగా కొలుకొని ప్రజాసేవానికి ముందుకు రావాలని కోరారు. అనంతరం ప్రమాదం జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులతో చర్చించి ఆరోగ్యం పట్ల ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాల, వైస్ ఎంపీపీ లక్ష్మణ్ , బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో భక్తులకు పండ్లు పంపిణీ



నవతెలంగాణ-బెజ్జూరు

మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా బీజేపీ నాయకులు సామల తిరుపతి ఆధ్వర్యంలో భక్తులకు అరటిపండ్లు పంపిణీ చేశారు. ఎస్ఐ విక్రమ్ ఆధ్వర్యంలో దద్దోజనం ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విక్రమ్, బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ, కుమ్మరి తిరుపతి, బెనికి శ్యాంసుందర్, ఏలేశ్వరం రమేష్, అన్నారం తిరుపతి, నెల్లి మహేష్, కుబిడె రాకేష్, చటారి రాజు, వెంకటి, ఇప్పకాయల శంకర్, యాద సంతోష్, ఏలేశ్వరం సాయి, సామల తిరుపతి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబురాలు

- 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటనపై హర్షం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2017 పీఆర్సీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడంపై ఉద్యోగులు కార్మిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. స్వీట్స్ తినిపించుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖామంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రముఖపాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఉద్యోగుల జీతభత్యాల విషయంలో తీవ్ర అన్యాయం చేసిందని కార్మిక నాయకులు ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫిట్‌మెంట్ ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పెండింగ్ బెనిఫిట్స్ కూడా ఇవ్వాలని కోరారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రభుత్వం గ్యారంటీ హామీల అమలుకు కృషి చేస్తుందని అన్నారు. నిరుద్యోగులకు మెగా డీఎస్సీ రూపంలో, ఆర్టీసీ కార్మికులకు 21 శాతం ఫిట్ మెంట్ ప్రకటించి కార్మికలోక సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆర్థిక లోటు ఉన్నప్పటికి ప్రజలకు మేలు జరగాలన్న లక్ష్యంతో మంచి ప్రజాపాలన అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల అశమ్మ, పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, కళ్లెం భూమారెడ్డి, నాగర్కర్ శంకర్, కిజర్ పాషా, రుక్మారెడ్డి, తిప్పిరెడ్డి విఠల్‌రెడ్డి, మొహమ్మద్ రఫీక్, నిమ్మల ప్రభాకర్, బండి దేవిదాస్‌చారి, బూర్ల శంకరయ్య ఉయిక ఇందిరా ఉన్నారు.

రాయిగూడ ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని రాయిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం ఆర్బీఎస్‌కే వైద్య సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న 12 మందిని మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు రేఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్‌కే వైద్యుడు నరేష్, సిబ్బంది అరుణ్, రోజా, విజయ్, ప్రకాష్ పాల్గొన్నారు.

మండల కేంద్రంలో ప్రజాపాలన సేవా కేంద్రం

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటుచేసినట్లు పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తెలిపారు. కౌటాల గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజాపాలన దరఖాస్తు దారులు ఎలాంటి సమస్యలున్నా సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

కనీస వసతులు కల్పించాలని వినతి

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో గల గ్రంథాలయంలో కనీస వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా గ్రంథాలయ కార్యదర్శికి వినతీ పత్రం అందజేశారు. కూర్చోవడానికి కుర్చీలు, బల్లలు లేవని చదుకునేందుకు సరైన పుస్తకాలు సమకూర్చకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సమస్యతో పాటు దినసరి వార్త పత్రికలు సైతం అందుబాటులో ఉంచకపోవడం నిరుద్యోగులను నిరుత్సాహానికి గురి చేస్తుందని పేర్కొంటున్నారు. గ్రంథాలయం ఆలనాపాలన చూడటానికి నియమించిన వ్యక్తి అందుబాటులో ఉండకపోవడం మరింత బాధాకరమని పేర్కొంటున్న స్థానికులు ఈ విషయంలో శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు అర్కాల రమేష్, మెండె మల్లేష్, నూతి నాగరాజు, మెట్టుపల్లి రాము, సిరిపురం మధూకర్, వేముల అరుణ్ కుమార్, గాలిపల్లి నాగభూషనం పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి మేఘనకు ఘన సన్మానం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్‌కు చెందిన గడ్డం మేఘన మొదటి ప్రయత్నంలోనే రెండు రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయం న్యాయ కళాశాల ఆధ్వర్యంలో డీయూసీఐఎంయూసీ-2024 లిటరసీ అండ్ కల్చరల్ ఫెస్టివెల్లో గడ్డం మేఘనను తెలంగాణ హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్ యాదవ్, సీనియర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి, ప్రిన్సిపాల్ రాధిక యాదవ్, న్యాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టైగర్‌జోన్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

- శాటిలైట్ ద్వారా సమాచారం
- ముందస్తుగా గ్రామాల్లో అవగాహన

నవతెలంగాణ-జన్నారం



వేసవి కాలంలో అడవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అటవీ శాఖ అధికారులు నూతన విధానాన్ని అవలంబిస్తున్నారు. ఈసారి కవ్వాల్ టైగర్ జోన్లోని అన్ని అటవీ డివిజన్లలో ఆచరిస్తున్నారు. వేసవిలో అడవిలో అగ్ని ప్రమాదాలు పొంచి ఉంటాయి. అడవికాలి వన్యప్రాణులు, చెట్లు, పక్షులకు ప్రాణహాని సంబవిస్తుంది. వేసవిలో అగ్ని ప్రమాదాలు నివారించి అడవికి నిప్పు తగలకుండా ఆపేందుకు అడవిలో కూలీల ద్వారా ఫైర్ లైన్స్(అగ్గి వరుసలు) ఏర్పాటు చేసి వాటికి నిప్పు పెడితే అడవంతా రగిలే అవకాశం ఉండదనే ఉద్దేశంతో అధికారులు ఫైర్ లైన్స్ ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వేసవిలో అడవిలో నిప్పు తగులకుండా మంచి ఫలితాలు ఇస్తున్నాయి. కవ్వాల్ టైగర్ జోన్ లోని ఖానాపూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల, జన్నారం అటవీ డివిజన్లలోని అన్నీ అటవీ బీట్లలో ఫైర్‌లైన్ పనులు చేయిస్తున్నారు. జిల్లాలోని ఫైర్ లైన్స్ కోసం కాంపా స్కీం కింద నిధు లు కేటాయించి సిబ్బందితో ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా అగ్గి పడిందని సమాచారం అందగానే సంబంధిత అధికారులు పరుగులు తీయాల్సి ఉంటుంది. బేస్ క్యాంపు సిబ్బంది, బీట్ అధికారులు ఆ స్థలానికి వెళ్లి బ్లోయర్లతో మంటలు వ్యాపించకుండా ఆకులను తొలగించి ప్రమాదాలు నివారిస్తున్నారు. అగ్గి వరుసలతో జిల్లాలోని కోర్ ఏరియాలో ఈ ఏడాది ప్రమాదాలు తగ్గగా.. బఫర్ ఏరియాలో కూడా చాలా వరకు తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు.

శాటిలైట్ ద్వారా అప్రమత్తం

అటవీ శాఖ ఉన్నతాధికారులు అగ్ని ప్రమాదాల నివారణకు టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ ఎస్ఎన్ పీపీ అనే శాటిలైట్ ఏర్పాటు చేశారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా డెహ్రాడూన్ ఆధ్వర్యంలో శాటిలైట్ ద్వారా ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరగుతున్నా సమా చారం చేరవేస్తారు. ప్రతీ రోజు ఏ చోట అగ్ని ప్రమాదం జరిగిన, జరుగుతున్న ప్రదేశంపై సంబంధిత అధికారులకు మొబైల్ ఫోన్కు మెస్సేజ్ వస్తుంది. కంపార్టుమెంటు నంబరుతో సహా తెలియజేస్తారు. అధికారులు జీపీఎస్ ద్వారా ఆ ప్రాంతానికి వెళ్లి మంటలు ఆర్పేస్తారు. అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలనూ గుర్తించి హెచ్చరికలు జారీ చేస్తారు. డివిజన్ స్థాయిలో డివిజన్ అధికారి మొబైల్ ఫోన్‌కు, రేంజ్ అధికారికి తన రేంజ్ పరిధిలోని బీట్లలో, బీట్ అధికారికి తన బీట్ పరిధిలో అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశం మెస్సేజ్‌లు వెళ్తాయి. దీంతో అప్రమత్తమై చర్యలు తీసుకుంటారు.

గ్రామాల్లో అవగాహన సదస్సులు

అటవీ సమీప గ్రామాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలు, నష్టంపై అటవీ శాఖ అధికారులు అవ గాహన కల్పిస్తున్నారు. పశువుల కాపరులు అగ్గిపెట్టలు, సిగరెట్, బీడీలు అడవిలోకి తీసు కెళ్లకుండా చూస్తున్నారు. పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టడం, చెత్త అడవిలో వేసి కాల్చడం చేయకుండా అవగాహన కల్పిస్తున్నారు.



ఆకులను వరుసగా పేర్చి కాలబెడుతున్న అటవీ సిబ్బంది

ఫైర్ లైన్స్ అంటే

అడవిలో ప్రస్తుతం ఆకులు రాలిపోతాయి. పశువుల కాపరులు, అడవికి వెళ్లిన వారు గాని బీడీ, చుట్ట తాగి పడేస్తే ఎండిన ఆకులకు అంటుకుని అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. మంటలు అడవంతా వ్యాపించి పక్షులు, చెట్లు, వన్యప్రాణులకు హాని కలిగే అవకాశం ఉంది. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ లైన్ సిస్టం ఏర్పాటు చేశారు. ప్రతీ బీట్‌లోని అటవీ ప్రాంతంలో ఎడ్లబండ్ల తొవ్వలు, కాలినడక తొవ్వలకు ఇరువైపులా ఎండిన ఆకులను ఎయిర్ బ్లోయర్ల తో ఐదు మీటర్ల వెడల్పులో పోగు చేస్తారు. దారులు నున్నగా చేసి పోగు చేసిన ఆకులకు నిప్పంటించి కాల్చేస్తారు. పూర్తిగా కాలిపోయే వరకు పర్యవేక్షి స్తారు. ఫలితంగా ఎవరైనా బీడీ కోసం నిప్పంటించుకుని అగ్గిపుల్ల పడేసినా నిప్పంటుకునే అవకాశం ఉండదు. ఎప్పటికప్పుడు దారులపై ఎండిన ఆకులు ఉండకుండా చూస్తారు. ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నా ఈదారుల వరకే వ్యాపించి ఆగుతుంది. అన్నిడివిజన్లలోని కంపార్ట్మెంట్, బీట్, డివిజన్, బౌండరీలలో ఈ అగ్గి వరుసలు వేస్తారు. జన్నారంఅటవీ డివిజన్‌లో 40 అటవీ బీట్లలో సుమారుగా 495 కిలోమీటర్ల దూరంలో ఫైర్ లైన్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

టైగర్ రిజర్వ్‌పై ప్రత్యేక శ్రద్ధ



కవ్వాల్ టైగర్ జోన్లో జన్నారం డివిజన్‌లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అడవుల్లో పర్య టించడం, అగ్ని ప్రమాదం జరిగినట్లు తెలిస్తే సిబ్బంది వెంటనే అగ్నిమాపక కిట్లతో వెళ్లి ఆర్పడం చేస్తున్నారు. ఇటీవల డివిజన్‌లోని బఫర్ ఏరి యాలో అగ్ని ప్రమాదం జరుగుతున్నట్లు శాటిలైట్ సమాచారం ఇవ్వడంతో సంబంధిత బీట్ అ ధికారిని అప్రమత్తమై ఆర్పేస్తారు. గత ఏడాది మార్చి వరకు 180చోట్ల అగ్ని ప్రమాదాలు జరుగగా, ఈ ఏడాది ఇప్పటివరకు 72 చోట్ల ఫైర్ పయింట్లు చూపుతూ మెస్సేజ్‌లు వచ్చి నట్లు అధికారులు చెబు తున్నారు. గత మూడేళ్ల క్రితంతో పరిశీలిస్తే ఇప్పుడు అడవుల్లో అగ్ని ప్రమాదాలు చాలా వరకు తగ్గుముఖం పట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి ఐదు వరకు, ఇంధన్‌పల్లి రేంజ్ పరిధిలో 30 మీటర్లు, జన్నారం ఆటవి డివిజన్ రేంజ్ పరిధిలో 28 మీటర్లు, తల్లాపేట రేంజ్ పరిధిలో 24 మీటర్లు ఫైర్ లైన్లను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు.



టైగర్‌జోన్ పరిధిలో ఆకులను కాల్చేసిన ఆటవీ సిబ్బంది

సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం

ఎఫ్ఆర్ఓ ఆఫీసొద్దీన్

వేసవి వచ్చిందంటే అడవుల్లో అగ్ని ప్రమా దాలు జరుగుతాయి. ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేసి సమాచారం అందిన వెంటనే సిబ్బందిని అక్కడికి పంపిస్తున్నాం. సిబ్బంది బ్లోయర్లతో అగ్గి రాజుకోకుండా ఆకులను దూరం చేసి ఫైర్ లైన్లు చేస్తున్నారు. కోర్ ఏరియాలో ఈ సంవత్సరం ప్రమాదాలు లేవు.

తాగు నీటి సమస్యకు పరిష్కారమార్గం

నవతెలంగాణ-జైపూర్

మండలం మిట్టపల్లి గ్రామ పంచాయతి పరిదిలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో గల తాగు నీటి సమస్యకు స్థానిక చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పరిష్కారమార్గం చూపించారని స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాలనీవాసుల నీటి ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే నెల రోజుల వ్యవధితో రూ.4 లక్షలతో రెండు బోరు బావులు ఏర్పాటుకు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. శనివారం కాలనీవాసులతో కలిసి బోరు బావుల పనులు ప్రారంభించినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు దుర్గం లింగన్న, కామెర మనోహర్, నైతం శంకరయ్య, మహేష్ తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రస్తుతం రూ.7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం కొనసాగుతుండగా గ్రామ పంచాయతి అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేయడానికి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఎస్సై ఉపేందర్ బదిలీ

నవతెలంగాణ-జైపూర్

కాళేశ్వరం జోన్ పరిధిలో గల వివిధ ప్రాంతాలకు చెందిన ఎస్సైలను బదిలీ చేస్తూ శనివారం డీఐజీ ఆఫ్ పోలీస్ కాళేశ్వరం కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ క్రమంలో జైపూర్ ఎస్‌హెచ్ఓగా విధులు నిర్వర్తిస్తున్న ఉపేందర్‌ను ఇక్కడి నుంచి రామగుండం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేస్తూ జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాకు చెందిన శ్రీధర్‌ను జైపూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

కేతేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం

జన్నారం : మండలంలోని పోనకల్ మేజర్ గ్రామ పంచాయితీలోని వీర్ల గుట్టపై ఉన్న శ్రీ కేతేశ్వర కంకలమ్మ ఆలయ అవరణలో శనివారం శివ పార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి భుమన్న స్వామి అధ్వర్యంలో కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణంలో మహేంద్ర సంఘం నాయకులు ఎం ఆర్.నర్సింగారావు, చిలువేరు నర్సయ్య, సుర్నేని కొండయ్య, కొడుజుట్టు రాజన్న, పిల్లి నర్సయ్య, పిల్లి మల్లయ్య, పర్ల కనకయ్య, పోతు సురేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది సేవలు ఎనలేనివి

- ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రేగుంట చంద్రకళ

నస్పూర్ : డాక్టర్ల, ఏఎన్ఎం, ఆశ వర్కర్ల సేవలు ఎనలేనివని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రేగుంట చంద్రకళ అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మున్సిపాలిటీపరిధిలోని ఏఎన్ఎంలను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్లు ఏఎన్ఎం, ఆశ వర్కర్లు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడడం జరిగిందని, నిత్యం ప్రజలతో ఉంటూ వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటూ వైద్యాన్ని అందిస్తున్న వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఉమా, విజయ, లక్ష్మి, జ్యోతి, మంజు, భాగ్య, లత, సృజన, పద్మ, స్వప్న, శైలజ నాగరాణి పాల్గొన్నారు.

పారదర్శకంగా క్వార్టర్ కౌన్సెలింగ్

నస్పూర్ : శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు చేంజ్ ఆఫ్ కోర్ట్ కౌన్సిలింగ్ శనివారం ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో ఎస్ఓ టు జీఎం పురుషోత్తం రెడ్డి పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించారు. 119 మంది క్వార్టర్లు తీసుకున్నారు. వీరికి వెంటనే క్వాటర్ అలాట్మెంట్ లెటర్లను అందజేశారు. ఉద్యోగులు తమకు నచ్చిన క్వార్టర్లు రావడం వలన వారు సంతోషాన్ని వ్యక్త పరుస్తూ క్వార్టర్ అలాట్మెంట్ లెటర్లను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్ డీవి రావు, డీజీఎం పర్సనల్ అరవిందరావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, డీవై పీఎం రాజేశ్వర్‌రావు, రాజు, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుండె రావు, సంక్షేమ అధికారులు రణదీప్‌గౌడ్, సంతోష్, పాల్ సృజన్, అజ్మీర రమేష్, సీనియర్ అసిస్టెంట్ లక్కాకుల శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్సెట్టిపేట : లక్సెట్టిపేట సర్కిల్లోని మూడు మండలాల విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. మూడు మండలాలకు సంబంధించిన 33 కేవీ లైన్ల మరమ్మత్తులు ఉండడంతో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లక్సెట్టిపేట సర్కిల్ పరిధిలోని లక్సెట్టిపేట, జన్నారం, దండేపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. మూడు మండలాల ప్రజలు, వ్యాపారస్తులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

లైటింగ్ ఏర్పాటు చేయాలి

జైపూర్ : ఇందారం బొగ్గు గని రోడ్‌తో పాటు ప్రధాన రోడ్డులో విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహమ్మద్ ఫయాజోద్దీన్, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు బేద మల్లేష్ కోరారు. ఈ సందర్భంగా శనివారం ఇందారం ఓపన్‌కాస్ట్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాసును కలిసి వినతీ పత్రం అందజేశారు. అదే విధంగా రాజీవ్ రహదారి వద్ద గని ప్రధాన రహదారి ఎదుట అర్చీ ఏర్పాటు చేయాలని కోరినట్లు వారు తెలిపారు.

వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ప్రభావిత, పరిసర గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వడానికి యాజమాన్యం దరఖాస్తులను స్వీకరిస్తోందనిఎస్టీపీపీ ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, పర్సనల్ మేనేజర్ రామ శాస్త్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 38 వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనుండగా అభ్యర్థులు ఎంచుకున్న కోర్సులకు అవసర మైన విద్యా అర్హత కలిగివుండాలని యాజమాన్యం వెల్లడించింది. 18 నుంచి 42 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులుగా అభ్యర్థి విద్యార్హతకు సంబందించిన ఉత్తీర్ణత పొందిన సంవత్సరం, మెరిట్ ఆధారంగా కోర్సులో శిక్షణకు ఎంపిక చేయనున్నారు. బ్యూటీషన్, కాస్మెటాలజీ, టైలరింగ్ కోర్సులలో కేవలం మహిళలు మాత్రమే అర్హులు కాగా ప్రతి ధరఖాస్తుతో పాటు కోర్సు అనంతరం సింగరేణిలో ఎటువంటి ఉద్యోగం ఆశించమనే హామీ పత్రం జతచేయాల్సివుంటుందని సంస్థ పేర్కొంది. ఆసక్తి, అర్హతగల యువతీ యువకులు తమ ధరఖాస్తులను ఈ నెల 15 లోపు సింగరేణి వెబ్‌సైట్‌లో గల రిజిస్ట్రేషన్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ నందు అప్‌లోడ్ చేయాల్సివుంటుంది. సందేహాలను నివృత్తి చేసుకోవడం కోసం 8333991821, 8332974669 నంబర్లలో సంప్రదించాలని సూచిస్తున్నారు. అదేవిధంగా అప్‌లోడ్ చేసిన ధరఖాస్తులను తగు విద్యార్హతల జిరాక్స్ ప్రతులను జతపర్చి సంబంధిత ఎంటీటీసీ సెంటర్‌లో అందజేయాలి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వృత్తి విద్యల నైపుణ్యం సాధించినట్లుగా ధృవీకరణ పత్రం జారీ చేయనున్నామని పేర్కొంటున్న ఆసక్తి గల వారు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్ నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-తాండూర్

కిష్టంపేట పంచాయితీలోని తంగలపల్లి 3వ వార్డులో శనివారం సీసీ రోడ్ నిర్మాణ పనులకు తాండూర్ ఎంపీటీసీ సిరంగి శంకర్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ ప్రెసిడెట్ కదరి రత్నాకర్‌రావు, కిష్టంపేట కోర్ కమిటీ సభ్యులు కామని శ్రీనివాస్, మొబిన్ అలీ, ఇందురీ గట్టన్న, సలిగామ మల్లేష్, మైదం అనిల్, నవీన్, సర్పంచ్ అదం ఖాన్, యూత్ కాంగ్రెస్ నాయకులు మినుగు తిరుపతి, మిణుగు రాజేశ్ పాల్గొన్నారు.

నేడు గురుకుల సైనిక్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్

నవతెలంగాణ-తాండూరు

బెల్లంపల్లి సీఓఈలో ఆదివారం సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంటవరకు నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు గంటముందే పరీక్షాకేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు సంక్షేమ గురుకులాల వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్, ఫ్యాడు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ వెంట తీసుకొని రావాలన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆద్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రుక్మాపూర్‌లో నడుస్తున్న సైనిక్ స్కూల్, కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైనిక్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ ఆదిలాబాద్ రీజియన్‌లో మంచిర్యాల జిల్లాకు సంబందించి బెల్లంపల్లి బాలుర సీఓఈలోను ఆదిలాబాద్ జిల్లాకు సంబందించి ఆదిలాబాద్ సీఓఈ గర్ల్స్ లోను, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు సంబందించి ఆసిఫాబాద్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేశారని తెలిపారు. పరీక్షకు సంబందించిన ఏర్పాట్లు, పరీక్షాకేంద్రాల్లో సౌకర్యాలను ఆర్సీఓ కొప్పుల స్వరూపరాణి పర్యవేక్షణలో జరుగుతున్నట్లు తెలిపారు.

శాస్త్రీయ ఆలోచనలు వచ్చేలా బోధన చేయాలి

నవతెలంగాణ-తాండూర్



బోధకులు విద్యార్థులకు తరగతి గది నుండే శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తేలా విద్యా బోధన చేయాలని బెల్లంపల్లి సీఓఈ ప్రిన్సిపాల్ అయినాల సైదులు తెలిపారు. సైన్స్ డే సందర్భంగా చంద్రశేఖర్ వెంకట్రామన్(సీవీ రామన్) చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. భారతదేశానికి ఇప్పటివరకు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన ఏకైక శాస్త్రవేత్త సీవీ రామన్ అని తెలిపారు. బయాలజీ, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్ర విభాగాల్లో ఉత్తమ సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదే విధంగా సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన వక్తృత్వ, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్ కుమార్, జెవీపీ పొన్నం శ్రీనివాస్, సైన్స్ డిపార్ట్మెంట్ అధ్యక్షుడు పొన్నాల రాజ్ కుమార్, కాసర్ల రాజేందర్, ఎండీ కౌసర్, రంగంశెట్టి శ్యామల, యాసాని హారిక, సింగారావు ప్రవంతి, అధ్యాపకులు పిన్నింటి కిరణ్, చందా లక్ష్మీనారాయణ, ఆకినేపల్లి రాజేష్, కట్ల రవీందర్, ముద్దసాని శోభ పాల్గొన్నారు.

ఇంటి పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-తాండూర్



ఇంటి పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని తాండూర్ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శనివారం తాండూరు పంచాయతీలో ఇంటి పన్ను వసూల్‌లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ప్రజలు ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. మొక్కలు షిఫ్టింగ్ గ్రేడింగ్ చేయాలని, జర్మినేషన్ రాని బ్యాగుల్లో తిరిగి విత్తనాల నాటాలని సూచించారు. మురికి కాలువలు పూడికతీత చెత్త కుప్పలు తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తపాస్ కుమార్ పాల్గొన్నారు.

మల్లన్న జాతరకు పోటెత్తిన భక్తజనం

- వేలాలలో 2వ రోజు కొనసాగిన జన జాతర



నవతెలంగాణ-జైపూర్

వేలాల గ్రామ శివారు భక్త జనులతో పోటెత్తింది. వేలాల మల్లన్న ఆలయ పరిసరాలతో పాటు పంట పొలాల్లో 2వ రోజు జన జాతర కొనసాగింది. కోరిన కోరికలు తీర్చే దేవునిగా విరాజిల్లుతున్న మల్లిఖార్జున స్వామిని దర్శించుకునేందుకు శనివారం తెల్లవారు జామున భక్తుల రాక సాగాయి. మహా శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం గట్టుమల్లన్న సన్నిధిలో జాగరణ చేసిన భక్తులు శనివారం మల్లిఖార్జున స్వామి దర్శనార్థం వేలాల దేవాలయానికి తరలివచ్చారు. ఈ ఏడాది 2 నుండి 3 లక్షల మంది మల్లన్న జాతరలో పాల్గొన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మల్లిఖార్జునస్వామి దర్శనం కోసం ఉదయం 6 గంటల నుండి భక్తులు క్యూలైన్‌లో నిల్చున్నారు. లక్షలాధిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిర్సిపోయింది. ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన క్యూలైన్లు సరిపోకపోవడంతో ఎర్రటి ఎండలో భక్తులు క్యూలైన్ కట్టాల్సి వచ్చింది. భక్తుల సౌకర్యార్థం సమీప గోదావరి నది ఒడ్డున ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌తో పాటు గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. పారిశుధ్య పనుల నిర్వాహణ కోసం నియమించిన పంచాయతి కార్యదర్శులు ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పనుల నిర్వాహణ పరిశీలించిన స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్ పారిశుధ్య పనులు నిరంతరంగా కొనసాగాలని ఆదేశించారు.





భారీ పోలీస్ బందోబస్తు

లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు సౌకర్యార్థం రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ అశోక్ యాదవ్ ఆదేశాల మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో వేలాల జాతరలో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు భక్తులు విడిది చేసిన ఏరియాలు, గోదావరి నది, పుష్కరఘాట్ ఏరియాల్లో బందోబస్తుతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు శ్రీరాంపూర్ సీఐ బన్సీలాల్ తెలిపారు. గోదావరి నది ఒడ్డున గజ ఈతగాళ్లతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, జాతరలో మఫ్టీ పోలీసు బృందాలు పర్యటిస్తూ శాంతి బధ్రతలకు భంగం కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.